

తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.117,400
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.1,0,581

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.1,38,600
రిటైల్ వెండి గ్రాము	రూ.141.60

క్లుప్తంగా

కనుమలోకి దూసుకెళ్లిన ఐషర్

– డ్రైవరు, క్లీనర్‌కు గాయాలు



లోయలో బోల్తా పడిన వాహనం

చంద్రగిరి : తిరుపతి– మదనపల్లె జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి ఐషర్ వాహనం అదుపుతప్పి భాకరాపేట కనుమలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. అనంతపురం నుంచి ఐషర్ వాహనంలో దోసకాయల లోడ్‌తో డ్రైవర్ వంశీ మంగళవారం బయల్దేరాడు. భాకరాపేట కనుమలోకి ప్రవేశించగానే వాహనం అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవరుతో పాటు క్లీనర్ శ్యామ్ గాయపడ్డాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు లోయలో పడిపోయిన క్షతగాత్రులను వెలికితీసి 108లో తిరుపతి రుయాకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి సంఘాల సహకారం

తిరుపతి సిటీ: ఎస్వీయూలో ఎట్టకేలకు పీజీసెట్–2025 ప్రక్రియ ప్రారంభమైంది. వర్సిటీలో సీటు పొందిన పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులతో బుధవారం వర్సిటీ కళకళలాడింది. రాయలసీమలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన విదార్థులకు వర్సిటీ అధికారులు కనీసం హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయకపోయినా ఆ బాధ్యతను విద్యార్థి సంఘాలు నిర్వర్తించి ప్రశంసలు మన్ననలు అందుకున్నాయి. ఎస్ఎఫ్ఐ వర్సిటీల కో–ఆర్డినేటర్ అశోక్ మాట్లాడుతూ, తాము ప్రత్యేకంగా కౌంటర్లు నిర్వహించి వర్సిటీలో నూతన ప్రవేశాలు పొందుతున్న విద్యార్థులకు సహకారం అందిస్తున్నట్టు చెప్పారు.



పెద్దశేషునిపై విహరిస్తున్న దేవదేవేరులు



పెద్ద శేష వాహనసేవకు సారె తీసుకువచ్చిన పాకాల మండల భక్తులు

వెంకన్న వైభవం

● తుమ్మలగుంటకు బ్రహ్మోత్సవ శోభ ● పెదశేషునిపై ఊరేగిన దేవదేవేరులు

తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలో శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు బుధవారం ధ్వజారోహణంతో శ్రీకారం చుట్టారు. శోభాయమానంగా అలంకరించిన దేవదేవేరులను పెదశేష వాహనంపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాలు.. గోవిందనామస్మరణల నడుమ కనులపండువగా ఊరేగించారు. ఉభయదేవేరీ సమేతంగా విహరిస్తున్న శ్రీవారిని దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కర్పూరహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాలను చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పాకాల మండలం నుంచి సారె తీసుకువచ్చిన భక్తులకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

– తిరుపతి రూరల్



వాహనసేవలో కేరళ వాయిద్యాలు



దర్శనానికి విచ్చేసిన వేద పాఠశాల విద్యార్థులు

సమీకృత వ్యవసాయ విధానాలు పాటిస్తే ఆదాయం



మాట్లాడుతున్న శాస్త్రవేత్త

తిరుపతి కల్చరల్: సమీకృత వ్యవసాయ విధానాలను పాటిస్తే రైతులు మంచి ఆదాయం పొందగలరని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం విస్తరణ శాస్త్రవేత్త రాముకుమార్ అన్నారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ సహకారంతో రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రాస్ సేవా నిలయంలో బుధవారం 'సమీకృత వ్యవసాయ విధానంపై' రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉద్యాన పంటలు, పశుగ్రాసం, పశుపోషణ, గొర్రెలు, కోళ్లు, పొట్టేళ్లు, చేపల పెంపకం, డ్రోన్ల వాడకం ..ఇత్యాది అంశాలపై అవగాహన కల్పించారు. రాస్ ప్రాజెక్టు ప్రతినిధులు కరుణాకర్, సీవీ.నాయుడు, ప్రాజెక్టు ప్రతినిధి మంజునాథ్, చిన్నగొట్టిగల్లు, రొంపిచర్ల మండలాలకు చెందిన 50 మంది రైతులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని అధికారులు

– సోషల్ మీడియాలో పోస్టులు

చంద్రగిరి: మండలంలోని దోర్నకంబాల సచివాలయ ఉద్యోగులు సమయపాలనకు తిలోదకాలిచ్చేశారు. బుధవారం ఉదయం 10.30 గంటలైనా ఒకే ఒక్క అధికారి మినహా తక్కిన వారెవరూ హాజరు కాకపోవడంపై స్థానికులు సోషల్ మీడియాలో పోస్టులు చేశారు. 10 మంది ఉద్యోగులకు గాను ఒక్కరే రావడం ఇదేమీ కొత్త కాదని, ప్రతి రోజూ ఉద్యోగులు ఇలాగే వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరు సమయపాలన పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఒక్క ఉద్యోగే హాజరైన దృశ్యం

హాజరు కాని వైద్యులు..!

దోర్నకంబాలలో బుధవారం స్వస్థ్ నారీ..పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారులు హాజరు కాలేదు. శిబిరంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లే వైద్యుల అవతారం ఎత్తి సేవలు అందించారు.

మహిళలకు వైద్య పరీక్షలు

తిరుపతి కల్చరల్: తిరుపతి గరుడాద్రి లయన్స్ క్లబ్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ఆవరణలో గర్భిణులు, వారి సహాయకులకు బుధవారం ఉచితంగా బీపీ, షుగర్ వైద్య పరీక్షలు నిర్వహించింది. అనంతరం మహాలక్ష్మి వితరణతో అల్పాహారం పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ భాస్కర్, అధ్యక్షుడు బండి మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జి.శంకర్, కోశాధికారి వి.పురుషోత్తం నాయుడు, రామచంద్రారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

● వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశంలో జిల్లా నేతలు



తాడేపల్లిలో బుధవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, సమన్వయకర్తలు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి, భూమన అభియన్ రెడ్డి







ఆకట్టుకున్న ఫల, పుష్ప ప్రదర్శన

తిరుమల: తిరుమలలో కల్యాణ వేదిక వద్ద ఏర్పాటు చేసిన ఫల, పుష్ప, చిత్ర ప్రదర్శనతో పాటు రామ్ భగీచా–2లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను బుధవారం టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడు బుధవారం ప్రారంభించారు. వార్షిక బ్రహ్మోత్సవాల వైభవాన్ని ఈ ప్రదర్శన ప్రతిబింబిస్తోందని ఆయన కితాబిచ్చారు. వివిధ స్టాళ్లను పరిశీలించారు. గార్డెన్ విభాగం రూపొందించిన ఘటోత్కచ, బకాసుర, ద్రౌపది స్వయంవరం..ఇత్యాది పురాణ నేపథ్య పుష్ప అలంకరణలు, బెంగళూరుకు చెందిన కళాకారిణి గౌరి రూపొందించిన సైకత శిల్పంలో ఆనందనిలయ విమాన వేంకటేశ్వరుని మోసుకెళ్తున్న మహా గరుడ రూపకల్పన విశేషంగా ఆకట్టుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు, చీఫ్ పీఆర్వో డాక్టర్ టి.రవి, గార్డెన్ డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేణు దీక్షిత్, ఎస్వీ శిల్ప కళాశాలకు చెందిన వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శన తిలకిస్తున్న టీటీడీ చైర్మన్ తదితరులు



కురుక్షేత్రంలో శ్రీకృష్ణుడు, అర్జునుడు



పుష్పాలంకరణలో గజేంద్రుడు

శ్రీలక్ష్మీ అలంకరణలో మూలస్థాన ఎల్లమ్మ



చంద్రగిరి: చంద్రగిరి గ్రామ దేవతన శ్రీమూస్థాన ఎల్లమ్మదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు శ్రీలక్ష్మీ అవతారంలో పెద్దశేష వాహనంపై కొలువుతీరి భక్తులను కటాక్షించారు. తొలుత ఉదయం మూలవిరాట్‌తో పాటు వివిధ దేవతలకు ప్రత్యేక పూజలు, మూలమూర్తికి అభిషేక సేవ నిర్వహించారు. అలాగే, స్థానిక ఆర్ఎఫ్ రోడ్డులోని శ్రీశ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయంలోని శ్రీసంతోషి మాత ఆలయంలో అమ్మవారు పార్వతీదేవి అలంకరణలో భక్తులను అనుగ్రహించారు.



ప్రయోగశాల భవన నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న వీసీ, అధికారులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ రూసా నిధుల ఫేజ్ 2.0లో భాగంగా సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కింద కొత్తగా మంజూరైన రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రయోగశాల నిర్మాణానికి బుధవారం వర్సిటీ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు భూమి పూజ చేశారు. వీసీ మాట్లాడుతూ, రూ. 6కోట్లతో ప్రయోగశాల భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ ఆచార్య నరసింహ, ఆచార్య బాలాజి , ప్రిన్సిపాళ్లు ఆచార్య పద్మావతి, భాస్కర్ రెడ్డి, రూసా సీఈఓ వంశీ, అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ ఫార్మాకో విజిలెన్స్ వారోత్సవాలు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న అధికారులు

తిరుపతి తుడా: ఎస్వీ వైద్య కళాశాలలో వారం రోజుల ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాలు బుధవారం ముగిశాయి. అడ్వర్స్ డ్రగ్ రియాక్షన్ మానిటరింగ్ సెంటర్, ఫార్మకాలజీ విభాగం, ఫార్మాకో విజిలెన్స్ ప్రోగ్రామ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ వారోత్సవాలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రభు మాట్లాడారు. ప్రజలకు ఔషధాల వాడకం, రోగుల రక్షణపై అవగాహన కల్పించేందుకు కరపత్రాలు, పోస్టర్లు పంపిణీ చేశారు. పోస్ట్‌గ్రాడ్యుయేట్, ఎంబీబీఎస్, హెల్త్ సైన్సెస్ విద్యార్థులకు ఇ–పోస్టర్, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సత్యనారాయణ మూర్తి, డాక్టర్ భారతి, డాక్టర్ వై.లక్ష్మి, డాక్టర్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

'వికసిత్ భారత్' లక్ష్యంగా ఏఐసీటీఈ ప్రణాళిక



అతిథులను సత్కరిస్తున్న ఆనందరెడ్డి

తిరుపతి రూరల్: అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహా సంఘ్ (ఏబీఆర్ఎస్ఎం), తిరుపతిలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ సంయుక్తంగా 'నూతన జాతీయ విద్యా విధానం–సాంకేతిక విద్య అభివృద్ధి' అనే అంశంపై సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీలో జాతీయ సెమినార్ నిర్వహించాయి. ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) సెక్రటరీ ప్రొఫెసర్ శ్యామ్‌రథ్ మాట్లాడారు. 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని చేరుకునేందుకు దేశవ్యాప్తంగా సాంకేతిక విద్య పాఠ్యాంశాలలో నూతన జాతీయ విద్యా విధానం అమలుకు చర్యలు తీసుకున్నామన్నారు. వీటిలో అధ్యాపకులకు శిక్షణ, ఇంటర్న్ షిప్, ప్రాజెక్టు వర్క్, అధునాతన ప్రయోగశాలలు, దేశీయ పరిశోధనల ప్రోత్సాహం మొదలైనవి ఉన్నాయన్నారు. వివిధ అంశాలపై ఏబీఆర్ఎస్ఎం జాతీయ సహ సంఘటన కార్యదర్శి గుంత లక్ష్మణ్ మాట్లాడారు. సదస్సులో రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి, రాష్ట్ర టెక్నికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ ఎస్. సుధాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ ముప్పా లక్ష్మణరావు, సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ సెక్రటరీ ఆనందరెడ్డి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజశేఖర్, సెమినార్ కన్వీనర్ డాక్టర్ సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బాలసుబ్రమణ్యం, రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల అధ్యాపకులు దాదాపు 300 మంది పాల్గొన్నారు.

'స్వచ్ఛ తిరుపతి'కి సహకరించండి

తిరుపతి తుడా: స్వచ్ఛ తిరుపతి సాధనకు అందరూ సహకరించాలని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అమరయ్య పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్థానిక సీఎల్‌సీ కార్యాలయంలో గాంధేయ వాద సంస్థ, ఐటీసీ సంస్థ స్వచ్ఛ మిత్రులకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. కార్యక్రమంలో ఐటీసీ ఉన్మాకాంత మాట్లాడారు. ఏజీఎస్ అశోక్ కుమార్, హేమ మహేశ్వరి, కుమారి, మెప్మా కృష్ణ, వేణు, సోమాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతికం

తిరుపతి కల్చరల్: శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం మహతి కళాక్షేత్రంలో బుధవారం హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తమిళనాడుకు చెందిన పి.ఆనంద్ జయరామ్ బృందం ప్రదర్శించిన 'ఆండాళ్ రంగనాథుల కల్యాణ వైభవ' నృత్య రూపకం అలరించింది. నృత్యాంజలితో ఆరంభమైన నృత్య రూపకం గోదా స్తుతి, వర్ణం, శ్రీమన్నారాయణుని శ్రీపాదమే శరణు, దశావతారస్తుతి వంటి సంకీర్తనలకు తమ నృత్యంతో మంత్రముగ్ధుల్ని చేశారు. కళాకారులకు సప్తగిరి మాసపత్రిక సీనియర్ ఉప సంపాదకురాలు డాక్టర్ అల్లాడి సంధ్య శ్రీవారి ప్రసాదాలు అందజేసి సత్కరించారు.

స్విమ్స్‌లో ఇంటర్వెన్షన్లు విజయవంతం

తిరుపతి తుడా: స్విమ్స్ కార్డియాలజీ విభాగం ఆధ్వర్యంలో 25,000 ఇంటర్వెన్షన్లు విజయవంతంగా నిర్వహించినట్లు ఆ విభాగాధిపతి సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ రాజశేఖర్ తెలియజేశారు. ఇది ఆసుపత్రికి గర్వకారణమని విభాగానికి చెందిన వైద్యులు, సిబ్బందిని ఆయన అభినందించారు.

రాజారామ్ హిమనికి డాక్టరేట్



హిమని

తిరుపతి రూరల్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం పరిశోధన విద్యార్థిని రాజారామ్ హిమనికి డాక్టరేట్ ప్రకటించినట్టు డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య అనురాధ తెలిపారు. ఆమె డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ కాత్యాయిని పర్యవేక్షణలో 'స్టార్టప్ ఇండియా పాలసీ అండ్ విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్'అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు.

విజయ గణపతి ఆలయాన్ని పరిశీలించిన డీఎల్‌పీఓ

చంద్రగిరి: తిరుచానూరు పంచాయతీలోని హోటల్ గ్రాండ్ రిడ్జ్ వెనుక వైపు ఉన్న శ్రీవిజయ గణపతి ఆలయాన్ని డివిజన్ పంచాయతీ అధికారి సురేష్ నాయుడు పరిశీలించారు. ఇటీవల ఆలయం పక్క న ప్రదక్షిణ స్థలాన్ని ఆక్రమించి రోడ్డు నిర్మాణానికి కూటమి నేతలతో అండతో కాంట్రాక్టర్ యత్నించడంతో ఆలయ ధర్మకర్త పుష్ప అడ్డుకున్నారు. అనంతరం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో డీఎల్‌పీఓ, పంచాయతీ ఈఓ ఆలయాన్ని పరిశీలించారు.

అభినందన



కలెక్టర్‌ను అభినందిస్తున్న మంత్రులు

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను బుధవారం రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అభినందించారు. ఇటీవల న్యూఢిల్లీలో జిల్లా కలెక్టర్ స్కోచ్ గోల్డెన్ అవార్డును అందుకున్న నేపథ్యంలో మంత్రులు ఆయన్ను అభినందించారు. చంద్రగిరి మండలంలోని మూడు పంచాయతీలలో 1600 గృహాలకు సౌర ఫలకాలను ఏర్పాటు చేసినందుకు కలెక్టర్ ఈ అవార్డు అందుకోవడం విదితమే. మంత్రుల వెంట హస్తకళ అభివృద్ధి సంస్థ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ ఉన్నారు.

ఎన్నికల హామీలు ఏమయ్యాయి..?



మాట్లాడుతున్న ఎస్టీయూ నేత

తిరుపతి అర్బన్: తాము అధికారంలోకి వస్తే టీచర్ల సమస్యలను పరిష్కరిస్తామంటూ ఇచ్చిన హామీలు ఏమయ్యాయో చెప్పాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి ప్రశ్నించారు. బుధవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయనతోపాటు జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథం మాట్లాడారు. ప్రధానంగా నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, ఇప్పటి వరకు ప్రభుత్వం ఆ ఊసే ఎత్తకపోవడం సరికాదని మండిపడ్డారు. ఉద్యోగ విరమణ సమయంలోనే అన్ని ఆర్థిక ప్రయోజనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే వచ్చే నెల 7న విజయవాడలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయవాణి సంపాదకవర్గ సభ్యుడు జి.గురుప్రసాద్, డివిజనల్ కన్వీనర్ వాసు తదితరులు పాల్గొన్నారు.

గాయత్రిదేవి అలంకరణలో గంగమ్మ



తిరుపతి కల్చరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో అమ్మవారు గాయత్రిదేవి అలంకరణలో కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, హోమం, సహస్రనామార్చన అనంతరం గాయత్రిదేవి అలంకరణలో కొలువుదీరారు. అలాగే కొత్తవీధిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో మూలవిరాట్ మహారాణి అలంకరణలో, ఉత్సవమూర్తి శ్రీరాజరాజేశ్వరి అలంకరణలో, మంగళం రోడ్డులోని బొంతాలమ్మ ఆలయంలో అమ్మవారు శ్రీఆదిపరాశక్తి దేవి అలంకరణలో భక్తులను అనుగ్రహించారు.

10 గంటల పని విధానాన్ని రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలో ఎనిమినిమిది గంటల పని విధానం రద్దు చేసి ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బుధవారం పాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకులు ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేటర్ల ప్రయోజనాల కోసం 8 గంటల పనివిధానాన్ని చట్ట సవరణ చేసి రోజుకు 10 నుంచి 13 గంటలు వరకు కార్మికులు పని చేయాలని కేంద్రం నిర్ణయించడం, దీనికి అనుకూలంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం శాసనసభ సమావేశాల్లో చట్టం చేయడం దారుణమని మండిపడ్డారు. ఈ పనిగంటల పెంపు విధానం టీటీడీ, స్విమ్స్, రుయాలో అమలు చేసే ప్రమాదం ఉందని, దీనికి కార్మికులు ఎదురు తిరగాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.సుబ్రమణ్యం, ఎస్.మాధవ్‌కృష్ణ, నేతలు ఎస్.జయచంద్ర, పి.మునిరాజ, పి.బుజ్జి, .చిన్న, ఎం.నరేంద్ర, వాసు, దాసు, శ్రీరాములు, మురళి, టీటీడీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నేతలు పార్థసారథిరెడ్డి, ప్రభాకర్, బాబు, అమ్ములు పాల్గొన్నారు.

పాకాలలో..

పాకాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పని గంటలు తగ్గించి కనీసం వేతనం రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఐటీయు జిల్లా నాయ కుడు మధుసూదన్ రావు డిమాండ్ చేశారు. బుధవా రం స్థానిక సంతగేటు వద్ద కార్మికులతో ధర్నా చేశా రు. కార్మిక నాయకులు మురళి, జనార్థన్‌నాయుడు, మహేశ్వరి, బావాజాన్, మురళి, వెంకటరమణ, పంచాయతీ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఎన్‌ఎస్‌ఎస్ డే



ఎన్ఎస్ఎస్‌డే వేడుకల్లో మహిళా వర్సిటీ అధికారులు



పాకాల: బాలికల జూనియర్ కళాశాలలో..

తిరుపతి రూరల్/తిరుపతి సిటీ/పాకాల: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం,జాతీయ సంస్కృత వర్సిటీ, పాకాల ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలల్లో బుధవారం జాతీయ ఎన్ఎస్ఎస్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఆచార్య ఐవీ లలిత కుమారి సమగ్ర నివేదిక సమర్పించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ నేత్రవైద్యులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఆర్ఆర్. రెడ్డి మాట్లాడారు. వర్సిటీలోని ఎస్ఎస్ యూనిట్లలో విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. ఆచార్య. టి.సుధా, ఆచార్య. కె. మధుజ్యోతి, డాక్టర్ బి.గంగా భవాని పాల్గొన్నారు. జాతీయ సంస్కృత వర్సిటీలో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. పాకాలలో కాలేజీల ప్రిన్సిపాళ్లు పి.హరినాథ ఆచ్చారి, రెడ్డిరామరాజు, ఎన్ఎస్ఎస్ అధికారులు మునిరాజ, విజయలక్ష్మి దేవి మాట్లాడారు. తులసీరామ్‌రెడ్డి, ధరణికుమార్, రమేష్, వసుంధరదేవి, నాగిని బేగం, చెంగల్‌రాజు, గీతాంజలి, శ్రీనివాసప్రసాద్, ఫరీద్, బాలు, ఆనంద్, గిరిజ, మోహనరంగ, చలమారెడ్డి, విజయనిర్మల, పద్మజ, రూప పాల్గొన్నారు.